ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- దుక్కులు దున్ని, నారుమడులు పోస్తున్న రైతులు
- ఇబ్రహీంపట్నం మండలంలో 8 వేల ఎకరాల్లో సాగు
- వరి, వాణిజ్య పంటలు, కూరగాయల సాగు

ఇబ్రహీంపట్నం: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో పాటు ఇప్పటికే కొద్దిపాటి తొలకరి వర్షాలు ముందస్తుగా కురవడంతో రైతులు పొలాల్లో దుక్కులు దున్నే పనులను ప్రారంభించారు. మరో పది రోజుల్లో ఏరువాక పౌర్ణమి కూడా రానుండటంతో ఏరువాక సేద్యంపై అన్నదాతలు దృష్టి సారించారు. మృగశిర కార్తెలో వచ్చే పౌర్ణమి ఏరువాక పౌర్ణమి నుంచి రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమవుతారు. అధికారులు వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడంతో కొంతమంది నారుమళ్లు సిద్ధం చేసుకోగా మరి కొంతమంది వరి నారుమళ్లు పోశారు. ఈ ఏడాది మండలంలో 8 వేల ఎకరాల్లో పంటలు సాగుచేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారి శైలజ తెలిపారు.

ఎత్తిపోతలు, చెరువుల ఆధారంగా సాగు

మండలంలో కృష్ణానది పరీవాహక ప్రాంత గ్రామాలైన జూపూడి, గుంటుపల్లి, తుమ్మలపాలెం, కొటికలపూడి గ్రామాల్లో ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులు వరి, చెరకు వంటి పంటలు పండిస్తారు. మూలపాడు, జూపూడి, కిలేశపురం, ఇబ్రహీంపట్నం, కొండపల్లి, ఈలప్రోలు గ్రామాల్లో ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడే బూడిద వ్యర్థ జలాలు, స్థానిక చెరువుల ద్వారా వరి, చెరకు, పత్తి, మొక్కజొన్న, మిర్చి, కంది, పుల్లశనగ వంటి వాణిజ్య పంటలతో పాటు వివిధ రకాల కూరగాయ పంటలు సాగు చేస్తారు. వ్యవసాయంలో రైతులకు ఎదురయ్యే సమస్యలతో పాటు నూతన వంగడాలు, సాగు పద్ధతులు, చీడపీడల నివారణపై వ్యవసాయాధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి మెలకువలు తెలియజేస్తున్నారు.





కొటికలపూడిలో ఖరీఫ్‌కు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు : త్రిలోచనాపురంలో ఎన్టీటీపీఎస్ బూడిద నీటితో ముందస్తుగా వేసిన వరి నారుమడి

8 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం

మండలంలో సుమారు 8,000 ఎకరాలు వ్యవసాయ సాగుభూమి ఉంది. వీటిలో సుమారు 1,000 ఎకరాలు లంక భూములు, సుమారు 7,000 ఎకరాలు పట్టా భూములు ఉన్నాయి. వీటిలో మొక్కజొన్న, చెరకు, వరి, మిర్చి, పత్తి, అరటి, నిమ్మ, జామ, మునగ వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తారు. 5,500 ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉంది. సుమారు 2,000 ఎకరాల్లో మొక్కజొన్న, చెరకు, పత్తి, పుల్లశనగ, మిర్చి తదితర వాణిజ్య పంటలు పండించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. 500 ఎకరాల్లో టమోటా, బీర, క్యాలీఫ్లవర్, దోస, దొండ, వంగ, క్యాబేజీ, అరటి, మునగ, గోరుచిక్కుళ్లు, కాకర, ఆకుకూరలు పండించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



జూపూడి లంక భూముల్లో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

రైతుల సేవలో రైతు భరోసా కేంద్రాలు

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతుల సేవలో తరిస్తున్నాయి. రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు పిల్లిపెసర, జీలుగ వంటి విత్తనాలు సబ్సిడీ ధరకు పంపిణీ చేశారు. సాగుకు అవసరమైన వరి విత్తనాలు బీపీటీ 5204, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318, సాంబ మసూరి రకాలు సకాలంలో రైతులకు సబ్సిడీపై అందిస్తున్నారు. ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు సాగులో అవసరమైయ్యే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం, సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

రైతులకు వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు, పురుగు మందులు, ఎరువుల వినియోగం, కలుపు నివారణ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలు ఆర్బీకేలో రిజిస్టర్ చేసుకున్న వారికి అందిస్తున్నాం. నీటి సౌలభ్యాన్ని బట్టి వచ్చే నెలలో వరినాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

– డి.శైలజ, వ్యవసాయ శాఖాధికారి, ఇబ్రహీంపట్నం



సకాలంలో విత్తనాలు అందాయి

వ్యవసాయానికి ఈ ఏడాది అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నాం. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు సకాలంలో అందాయి. ఈ ఏడాది వర్షాలు ముందుగానే రావడంతో దుక్కులు దున్ని వరి నారుమళ్లు సిద్ధం చేసుకున్నాం.

– నిమ్మగడ్డ సత్యనారాయణ, రైతు, మూలపాడు

క్లుప్తంగా

పేదలకు ఉచితంగా మినరల్ వాటర్



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): పేద కుటుంబాలకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎక్కువగా ఫ్లోరైడ్ వాటర్ ఉండటంతో వాటిని సేవించిన ప్రజలు ఎముకలు సంబంధిత వ్యాధులు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రతి రోజూ వెయ్యి లీటర్ల మినరల్ వాటర్‌ను పేదలకు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. సంస్థ కార్యదర్శి సుమలత, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆర్పీఎఫ్ ఏఎస్ఐ వి.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రూ.5 లక్షల ప్రమాద బీమా మంజూరు చేసింది. ఈ మేరకు సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ వి.లీలా చేతుల మీదుగా మృతుడి భార్య వి.సుజాతకు చెక్కును అందజేశారు. సంఘ్ ప్రెసిడెంట్ ఎస్.రామగుప్తా, సొసైటీ సభ్యులు బి.ప్రభాకర బాబు, ఎస్వీపీ మల్లేశ్వరరావు, మహేష్ నాయుడు, రాజారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి రాజీనామా

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి–1 ఎంపీటీసీ సభ్యురాలు షేక్ శంషూ, ఆమె భర్త నాగుల్ మీరా వైఎస్సార్ సీపీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆగిరిపల్లిలో టీడీపీకి వైఎస్సార్ సీపీ కంటే ఎక్కువ ఓట్లు రావడంతో మనస్థాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నామని ఆమె తెలిపారు.

పాఠశాలల ప్రారంభం రోజే పుస్తకాల పంపిణీకి చర్యలు



ఇబ్రహీంపట్నం: ఈ ఏడాది ఒక రోజు ఆలస్యంగా ఈనెల 13వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని, అందుకు అనుగుణంగా పాఠశాలలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న అధ్యక్షతన ఎంపీపీ కార్యాలయంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముందుగా ప్రభుత్వం ప్రకటించిన 12వ తేదీన సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఒక రోజు ఆలస్యంగా పాఠశాలలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. పాఠశాలల్లో అనుసరించాల్సిన విధి విధానాలను తెలిపారు. ఎంపీపీ జోత్స్న మాట్లాడుతూ పాఠశాలలు తెరిచిన తొలి రోజే విద్యార్థులకు బ్యాగులు, బుక్స్, షూస్, రెండు జతల యూనిఫామ్, సాక్స్, బెల్టులు కలిగిన కిట్లు పంపిణీ చేయాలన్నారు. ఎంఈఓ సీహెచ్ పుష్పలత మాట్లాడారు. ఎంఈఓ–2 శ్యాంబాబు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ముళ్లకంప తొలగింపునకు చర్యలు

తిరువూరు: తిరువూరు నుంచి అక్కపాలెం వెళ్లే రోడ్డులో ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లకంపలు, పిచ్చిచెట్ల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ముళ్లకంపలు, పిచ్చిచెట్లతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు ఆదేశించారు. పనులను ఆయన ప్రారంభించారు.

వీరాంజనేయుడికి లక్ష మల్లెలతో అర్చన



తిరువూరు: స్థానిక రాజుపేట వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు లక్ష మల్లెలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గోదాదేవీ సమేత శ్రీకృష్ణుడికి, సీతారామ లక్ష్మణులకు విష్ణు సహస్ర నామార్చన, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

15న ఆలయ భూముల కౌలు వేలం

నందిగామ టౌన్: మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములకు టెండర్ కం బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో ఫణికుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాములూరు, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామ శివారులో ఉన్న 3.67 ఎకరాలకు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో టెండర్ కం బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించే ఈ వేలంలో రైతులు పాల్గొనాలని కోరారు.

15న ఆలయ హుండీ కానుకల లెక్కింపు

నందిగామ పట్టణంలో సీతారామాంజనేయ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 15న సాయంత్రం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈవో ఫణికుమార్ చెప్పారు. కానుకల లెక్కింపులో ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని కోరారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శివపార్వతి అన్నారు. మండల పరిధి జుజ్జూరు గ్రామంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆమె కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందన్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

42 వేల పాఠ్య పుస్తకాలు సరఫరా

నూజివీడు: 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. దీనిలో భాగంగా పాఠ్య పుస్తకాలు ఇప్పటికే పట్టణంలో ఏర్పాటు చేసిన స్టాకు పాయింట్‌కు చేరుకున్నాయి. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 75 వేల పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, మొదటి విడతగా 42 వేల పాఠ్య పుస్తకాలు ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన స్టాకు పాయింట్‌కు చేరాయి. ఇంకా 33 వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉంది. వీటిని సెట్ల వారీగా పాఠశాలలకు పంపించేందుకు సీఆర్పీలు సిద్ధం చేస్తున్నారు. 8 నుంచి పదో తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు వచ్చాయి. విద్యార్థులకు అవసరమైన రాత పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. వీటిని ఆయా పాఠశాలలకు పంపేందుకు ఎంఈఓ–1 ఎం సేవియా ఏర్పాట్లు చేశారు.



మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

నూజివీడు: ఇంటి పరిసరాల్లోని మురుగు నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, వర్షాకాలం ప్రారంభమైనందున ప్రతి ఒక్కరూ దోమల నివారణకు చర్యలు చేపట్టాలని నూజివీడు డెప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని కోనేరుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కలిసి మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, మెదడువాపు వ్యాధి తదితర అనేక రకాల ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు కొలుసు సౌమ్య, సబ్ యూనిట్ అధికారి ఎం. యలమంద, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



నూజివీడు కోనేరుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు

బ్లాక్ చైన్ టెక్నాలజీపై అవగాహన

కంచికచర్ల: విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అల్గోరాండ్ సంస్థ టెక్నికల్ లీడ్ డాక్టర్ నిఖిల్ వర్మ అన్నారు. కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్ చైన్' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బ్లాక్ చైన్ టెక్నాలజీ ప్రాముఖ్యత, భవిష్యత్‌లో ప్రయోజనాలు, విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల గురించి వివరించారు. అల్గో భారత సంస్థ రీజినల్ అంబాసిడర్ మల్లారెడ్డి ఆకాష్‌రావు మాట్లాడుతూ ప్రముఖ ఎన్‌జీఓ నాస్కామ్ ఈ బ్లాక్ చైన్ సర్టిఫికెషన్ కోర్సును ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ఈ సర్టిఫికెషన్ కోర్సుతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. సదస్సులో కళాశాల సీఈఓ డీ పాండురంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకిరణ్, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ ఎం.సుహాస్, ఎ. అనురాధ, మొహంతి, పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నిఖిల్ వర్మ

ఏపీ ఈఏపీ సెట్‌లో వికాస్ విద్యార్థుల ప్రతిభ



విస్సన్నపేట: ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో స్థానిక వికాస్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి మంగళవారం తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో తమ కళాశాలకు చెందిన లంకే ఆకాష్ 3,094, కడిమెళ్ల గాయత్రి 9,033, చెన్ను కల్యాణి 9,285, తోట సాయిశ్రీరామ్ 16,361, లేళ్ల లీలామణికుమార్ 18,980, చిన్నం నాగతేజశ్విని 19,388, గోళి రేణుక 23,184, మేశపాం జాషువా 26,435, నల్లిబోయిన అజయ్‌కుమార్ 29,883, అన్నవరపు నాగదేవిక 33,907 ర్యాంకులు సాధించారని వివరించారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో పల్లెపాం శామ్యూల్ ఎలిజా 26,187, బెజవాడ రాజేశ్వరి 28,113 ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నర్సిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఆటో ఢీ కొని వ్యక్తికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టిన ఘటనపై మంగళవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుణదలకు చెందిన చొప్పవరపు త్రినాథ్ తాపీ పని చేస్తుంటాడు. ఈయన ఈ నెల 9వ తేదీ సాయంత్రం కే హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ఆటో త్రినాథ్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఆయన మంగళవారం గుణదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జూలైలో ఏఐటీయూసీ శిక్షణ తరగతులు

నూజివీడు: నూజివీడులో జూలైలో నిర్వహించే ఏఐటీయూసీ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతుల్లో సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలు చర్చిస్తామన్నారు. నూతనంగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారం, స్కీం వర్కర్ల జీతాల పెంపు వంటి సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, నూజివీడు ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థ సీఎస్ఐఆర్–ఐఐసీటీలో ప్రధాన పరిశోధకులు డాక్టర్ కె.నాగయ్య అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ రంగంలో పరిశోధనలు అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం పరిశోధనలు జరుగుతున్న తీరు, భవిష్యత్‌లో పరిశోధనా రంగంలో రాణించడానికి అవసరమైన మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా ఆ కళాశాలలో చేస్తున్న పరిశోధనలను తెలుసుకుని, వివిధ ప్రభుత్వ రంగ, ఇతర సంస్థల నుంచి రీసెర్చ్ గ్రాంట్స్ పొందడానికి గల అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సునీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి వారి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఆసక్తి కలిగిన భక్తులు సంప్రదాయ దుస్తులతో పాల్గొనవచ్చని చెప్పారు.